# రబీ పంటకు విత్తనాలు సిద్ధం

**సిద్ధమైన ఎంటీయూ 1153, పీఆర్ 126 రకం విత్తనాలు**



కోతకు సిద్ధంగా ఉన్న ఎంటీయూ 1153 రకం వరి విత్తనాలు

**పాలకొల్లు అర్బన్:** దాళ్వా పంట అయిన రబీకు రైతులు విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. రైతు తనకు అవసరమైన విత్తనాలను తనే స్వయంగా సిద్ధం చేసుకోవడం వలన నకిలీ విత్తనాల బెడద ఉండదు. నారుమడిలో 85 శాతానికి పైగా మొలకలు వచ్చి ఆరోగ్యకరమైన వరి నారుని రైతులు పొందుతారు. దాళ్వా పంటకు ఎంటీయూ 1153, పీఆర్ 126 వరి రకాలను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. దీని కోసం పాలకొల్లు మండలంలోని 10,500 ఎకరాల సాగుకు అవసరమైన ఎంటీయూ 1153 రకాన్ని 120 ఎకరాల్లోనూ, అలాగే పీఆర్ 126 రకాన్ని 15 నుంచి 20 ఎకరాల్లో రైతులు సార్వా పంటలో సాగు చేశారు. ప్రస్తుతం ఈ వరి వంగడాలు దిగుబడికి సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని బల్లిపాడు, దగ్గులూరు, తిల్లపూడి, శివదేవుని చిక్కాల, వెంకటాపురం, అరట్లకట్ట, కాపవరం గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్నాయి.

**400 ఎకరాల్లో నాట్లు వేయలేదు**

పాలకొల్లు మండలంలో పెదమామిడిపల్లి, దిగమర్రు, కొత్తపేట, ఆగర్రు, ఆగర్తిపాలెం, సగం చెరువు తదితరగ్రామాల్లో 400ఎకరాలకు పైగా సార్వాకు వరినాట్లు వేయలేదు. అధిక వర్షాల వలన రెండు సార్లు నారుమడులు వేసినప్పటికీ అధికవర్షాల వలన ముంపునకు గురయ్యాయి. రెండోసారి వ్యవసాయాధికారులు సబ్సిడీపై విత్తనాలు ఇచ్చారు. అవి కూడా వర్షాల కారణంగా కుళ్లిపోయాయి. ప్రస్తుతం ముందస్తు దాళ్వాకు అనుకూలంగా వరి వంగడాలు రైతులు సిద్ధం చేసుకుంటున్నారు.

**ఎంటీయూ 1153 రకం**

115–120 రోజుల కాలంలో కోతకు వస్తుంది. 50 నుంచి 60 బస్తాలు దిగుబడి రావచ్చు. సన్నాలు, పొడుగు బియ్యం కావడం వలన ఎగుమతికి అనుకూలం.

**పీఆర్ 126 రకం**

ఇది కూడా 110–120 రోజుల కాల వ్యవధిలో పంట చేతికొస్తుంది. 50 నుంచి 60 బస్తాలు దిగుబడి వస్తుంది. సన్నాలు, పొడుగు బియ్యం. ఎగుమతులకు అనుకూలం

### విత్తనాల్లో 12 శాతం తేమ ఉండాలి



కోతకు సిద్ధంగా ఉన్న ఎంటీయూ 1153 రకం, పీఆర్ 126 రకాలను 12 నుంచి 13 శాతం తేమ ఉండేలా ఒబ్బిడి చేసుకోవాలి. అలాగే నారుమడి వేసుకునే సమయంలో విత్తన శుద్ధి చేసుకోవాలి. మండలంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు రైతుల వద్దే లభ్యమవుతాయి. దీని వలన నకిలీ విత్తనాల బెడద ఉండదు.

– కె రాజశేఖర్, వ్యవసాయాధికారి, పాలకొల్లు

### 22న ప్లేస్‌మెంట్ డ్రైవ్

**పెనుగొండ:** రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, నేషనల్ కెరియర్ సర్వీసు ఆధ్వర్యంలో ఆచంటలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 22న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ముత్తూట్ ఫైనాన్స్, ఏపీ ఎయిర్‌టెల్ పేమేంట్ బ్యాంకు వంటి కంపెనీల్లో కస్టమర్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఆపరేటర్ వంటి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేడు గుడాల గోపి పర్యటన

**పాలకొల్లు అర్బన్:** వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శనివారం ఉదయం 9గంటల నుంచి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. పోడూరు, పాలకొల్లు, యలమంచిలి మండలాల్లో పలు గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను కలుసుకుంటారు. అనంతరం యాళ్లవానిగరువులో మధ్యాహ్నం నుంచి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

## క్లుప్తంగా

### ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి



నిరసనన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

**పెనుగొండ:** విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో మోపుతున్న ట్రూ అప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆచంట కచేరీ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలో ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలు సెస్సులు రద్దు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని గతంలో వాడుకున్న విద్యుత్‌కు నేడు బిల్లులు చేసే విధానాన్ని తక్షణం రద్దు చేయాలని కోరారు. పార్టీ నాయకులు సిర్రా నరసింహమూర్తి, ఎస్‌వీఎస్ శర్మ, కుసుమే రాజు, తలుపూరి బుల్లాబ్బాయి, చదలవాడ చంటి బాబు, బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, గుత్తుల రంగారావు, ఉన్నమట్ల దుర్గా ప్రసాద్, పాల్గొన్నారు.

### బూరుగుపల్లిలో 14 దరఖాస్తులు



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్

**యలమంచిలి:** రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించేందుకు తొలిరోజు బూరుగుపల్లిలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో భూమి సమస్యలపై రైతులనుంచి 14 దరఖాస్తులు వచ్చా యి. జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్ కోరు తూ 4 దరఖాస్తులు, మ్యూటేషన్ కోసం 6 దర ఖాస్తులు, విస్తీర్ణం సవరణ కోసం 2, కొరిలేషన్ కోసం 1, ఆధార్ అప్‌డేట్ కోసం 1 మొత్తం 14 దరఖాస్తులువచ్చాయి. ఈ దరఖాస్తులపై విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ తెలిపారు. శిరగారపల్లి గ్రామంలో శనివారం రెవెన్యూ సద స్సు నిర్వహిస్తామని తహసీల్దార్ పవన్ చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్ సన్, ఆర్ఐ యశోద, వీఆర్వో అల్లంనాగరాజు, పాల్గొన్నారు.

### సమాచార చట్టంపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి

**యలమంచిలి:** సమాచార హక్కు చట్టం –2005పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి కోరారు. మండలంలోని మేడపాడు రైతుసేవా కేంద్రంలో శుక్రవారం ఆమె రైతులకు, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలకు సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలు తమకు కావలసిన సమాచారాన్ని పొందడానికి ఈ సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. అయితే ఈ చట్టంపై అడిగే సమాచారం ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

### కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

**పాలకొల్లు సెంట్రల్:** పట్టణంలో ప్రజలు కుక్కలతో బెంబేలెత్తిపోతున్నారు. ఎక్కడ చూసినా గుంపులు గుంపులు గా తిరుగుతూ స్వైర విహారం చేస్తున్నాయి. వీధిలోకి రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. స్థానిక బ్రాడీపేట 5వ వీధిలో బి.దుర్గ కుళాయి వద్ద మంచినీళ్లు పట్టుకొని ఇంటికి వెళుతుండగా అక్కడే ఉన్న ఓ కుక్క ఆమె కాలుపైన కండ ఊడేలా కొరికింది. అలాగే టిడ్కో గృహాల సముదాయంలో నివసిస్తున్న బి.గోవర్ధన్ వెలమగూడెం ప్రాంతం నుంచి వెళుతుండగా ఓ కుక్క కారుకు అడ్డు వచ్చింది. ప్రమాదంలోఉన్న ఆ కుక్కను పక్కకు తీసి వెళ్లిపోతున్నాడు. వెనక నుంచి వచ్చి గోవర్ధన్ కాలును కొరికింది. ఇద్దరూ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. శుక్రవారం పాఠశాలకు వెళుతున్న ఓ బాలికపై కూడా కుక్క దాడి చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈనెలలో ఇప్పటికే 70 వ్యాక్సిన్లు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

### వేధింపులపై కేసు నమోదు

**యలమంచిలి:** అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన సానా రామలక్ష్మికి 12 ఏళ్ల క్రితం కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం నీలంపూడి గ్రామానికి చెందిన సానా శ్రీనివాస్‌తో వివాహమైంది. కొంతకాలం కాపురం సక్రమంగా సాగింది. ఆ తర్వాత భర్త శ్రీనివాస్‌తోపాటు అత్త అమ్మాజీ కలిసి అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించారు. దీంతో ఆ వేధింపులు తట్టుకోలేక రామలక్ష్మి శుక్రవారం భర్త, అత్తలపై యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్రీడి గుర్రయ్య తెలిపారు.

## మూడు వైన్‌షాపులు వివాదాస్పదం



మార్టేరులో ఆచంట మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వైన్‌షాపు

**పెనుమంట్ర:** మండలానికి ఆరు వైన్ షాపులు కేటాయించగా డ్రాలో కొన్ని సిండికేట్‌కు చెందిన యజమానులకు షాపులు దక్కాయి. దీంతో ఆయా షాపులు దక్కించుకున్న యజమానులు కొత్తషాపులను ప్రారంభించారు. అందులో రెండు షాపులు మార్టేరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయగా, వెలగలేరు, ఆలమూరు, పెనుమంట్ర, గరువు పంచాయతీల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. అయితే మూడుషాపులు గతంలో నిర్వహించే షాపులలోనే ఏర్పాటు చేయగా, మరో మూడు షాపులు కొత్త ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. పెనుమంట్ర మండలానికి షాపు నెంబర్ 156 నుంచి 161 వరకు కేటాయించారు. ఇందులో 159 షాపును గరువు గ్రామ పంచాయతీ పరిధిలో స్టేట్‌హైవే రోడ్డు పక్కన గల ఆంధ్రా అసోసియేషన్ జూనియర్ కళాశాల సమీపంలోనే కొత్తగా ఏర్పాటు చేసారు. 160వ షాపును పెనుమంట్ర పంచాయతీ పరిధిలో గ్రంథాలయం, తహసీల్దార్ కార్యాలయం పక్కనే గల పాతషాపులోనే కొత్తగా ప్రారంభించారు. 161 షాపును మార్టేరు పంచాయతీ పరిధిలో ఆచంట మెయిన్‌రోడ్డులో కట్లమ్మతాడి సమీపంలో కొత్తగా ఏర్పాటు చేశారు. అయితే 159, 160, 161 నంబర్‌గల షాపులు విద్యాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, మెయిన్‌రోడ్డు పక్కనే ఏర్పాటు చేయడంతో వివాదాస్పందంగా మారాయి. ఇప్పటికే 159 షాపుపై కళాశాల యాజమాన్యం ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మూడు షాపులు స్టేట్‌హైవే రోడ్డులో ఉండటం వలన అనేక ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమై రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, మెయిన్ రోడ్డు పక్కనే బ్రాంది షాపులు ఏర్పాటు చేయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బాల్య వివాహాలు భవితకు అవరోధాలు



బాల్య వివాహ నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



పెనుగొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

**పాలకొల్లు సెంట్రల్:** బాల్య వివాహాలు భవితకు అవరోధాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బాల్య వివాహాల నిరోధంపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ నిమిషానికి ముగ్గురు బాలికలు బలవంతంగా పెళ్లి బంధంలో చిక్కుకుంటున్నారన్నారు. బాల్య వివాహాలను 1929లోనే నిషేధించారని తెలిపారు. బాల్య వివాహ నిషేధ చట్టం 2007 జనవరి 10వ తేదీన ఆమోదించగా నవంబర్ ఒకటో తేదీన అమల్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యంద్రకళ, భవానీదుర్గ, శశికళ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

**బాల్య వివాహాలు ఆపండి**

**పెనుగొండ:** బాల్య వివాహాలను ఆపడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పెనుగొండ సెక్టార్ సూపర్‌వైజరు ఎం.విజయకుమారి అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వాసవీ విజ్ఞాన్ విద్యార్థులతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి, నినాదాలతో ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహాల వలన ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ప్రోత్సహించిన వారు సైతం శిక్షకు గురవుతారన్నారు. అవగాహన లేని తనంతో బాల్య వివాహాలు చేస్తే అనారోగ్య సమస్యలతో పాటు, ఇతర సమస్యలు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నటనపై ఆసక్తే హీరోను చేసింది



ఎంతపని చేసావ్ చంటి చిత్రం నటీనటులు

**నరసాపురం రూరల్:** నటనపై తనకు చిన్నతనం నుంచి ఉన్న ఆశక్తే నేడు తనను కథానాయకుడిని చేసిందని (ఎంతపని చేసావ్ చంటి) చిత్ర హీరో శ్రీనివాస్ ఉలిశెట్టి స్పష్టం చేశారు. ఈ నెల 19న ఈ చిత్రం ఆడియో రిలీజ్ ఫంక్షన్ పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వైఎన్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ వేడుకను పురష్కరించుకొని చిత్ర యూనిట్ పాలకొల్లు, నరసాపురం పరిసర ప్రాంతాల్లోని ప్రైవేట్ కళాశాలల్లో హంగామా చేశారు. నరసాపురం మండలం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలకు శుక్రవారం విచ్చేసిన చిత్ర బృందానికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా హీరో శ్రీనివాస్ పాత్రికేయులతో మాట్లాడుతూ తాను తీర ప్రాంతమైన వేములదీవి గ్రామంలో పుట్టి పెరిగానన్నారు.

**సినిమా పోస్టర్ విడుదల**

**నరసాపురం:** వైఎన్ కళాశాల పూర్వ విద్యార్థి ఉలిశెట్టి శ్రీనివాస్ హీరోగా నటించిన ఎంత పని చేశావ్ చంటి తొలి చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా శుక్రవారం కళాశాలలో సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతుందని చెప్పారు.

## ప్రజలపై విద్యుత్ అదనపు భారం దారుణం



నరసాపురం: ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



పాలకొల్లు అర్బన్: అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**నరసాపురం:** ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారాలు మోపడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు అన్నారు. అదనపు విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ఎప్పుడో వాడుకున్న కరెంట్‌కు ఇప్పుడు చార్జీలు వసూలు చేయడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలపై 20 వేల కోట్ల భారాన్ని మోపిందన్నారు. ఇదే విధానంలో ముందుకు వెళితే కూటమి సర్కార్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. సీపీఎం నేతలు పొగాకు నారాయణరావు, పొగాకు పూర్ణ, బాతిరెడ్డి బాబ్జి, పున్నాని అప్పలనాయుడు పాల్గొన్నారు.

**అదనపు భారాన్ని రద్దు చేయాలి**

**పాలకొల్లు అర్బన్:** ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై విధించనున్న విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం నాయకులు, మాజీ ఎమ్మెల్యే దిగుబాటి రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఇండోర్ విద్యుత్ కేంద్రం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎలక్ట్రికల్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ సూపర్ 6 పేరుతో ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సూపర్ 6 బ్రాండ్ పేరుతో ప్రజలను మత్తులో ముంచుతోందని రాజగోపాల్ దుయ్యబట్టారు. సీపీఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, నాయకులు వై.అజయ్‌కుమార్, టి.గంగరాజు, చల్లా సోమేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ, ఇరగారపు రాజు, టి.శ్రీనివాసరావు, పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

## పోల్‌పై నుంచి పడిన కాంట్రాక్ట్ ఉద్యోగి



మంచానికే పరిమితమైన షణ్ముకేశ్వర్

**పాలకొల్లు సెంట్రల్:** మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు విద్యుత్ పోల్‌పై నుంచి పడి వెన్నుపూసకు గాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని 28వ వార్డుకు చెందిన తుమ్మిడి సత్యనారాయణ నాయీ బ్రాహ్మణుడు కుల వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు షణ్ముకేశ్వర్ మున్సిపల్ కార్యాలయంలో ఆరు నెలల క్రితం ఎలక్ట్రీషియన్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో చేరాడు. గత నెల 6న 12వ వార్డులో విద్యుత్ పోల్‌పై పని చేస్తుండగా షాక్‌కు గురై పోల్‌పై నుంచి కింద పడిపోయాడు. దీంతో షణ్ముకేశ్వర్ వెన్నెపూసకు తీవ్ర గాయమయ్యింది. హుటాహుటిన మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు షణ్ముకేశ్వర్‌ను రాజమండ్రిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అక్కడ వైద్యం చేయించారు. షణ్ముకేశ్వర్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. బాధితుడు కాంట్రాక్ట్ ఉద్యోగి కావడంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వీరికి జీతాలు ఇస్తుంటారు. బాధితుడికి ఐదు నెలల జీతం రావలసి ఉంది. తన కుమారుడు మంచంపైనే ఉండడం ఆసుపత్రికి తీసుకెళుతుండడం వలన ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో బాధితుడి తండ్రి మునిసిపల్ కార్యాలయంలో కాంట్రాక్టర్ కోసం నెల నుంచి తిరుగుతూనే ఉన్నాడు. సంఘటన జరిగిన నాటి నుంచి ఆ కాంట్రాక్టర్ ఎవరో ముందుకు రావడం లేదని బాధితుడి తండ్రి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

### నేడు పల్లె పండుగ

**మొగల్తూరు:** పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలను శనివారం మండలంలోని కేపీపాలెం సౌత్ గ్రామంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో త్రిశూలపాణి శుక్రవారం తెలిపారు.



## జీవాలకు నట్టల నివారణ మందులు వేయించాలి



గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న డాక్టర్ నీలిమ, సిబ్బంది

**మొగల్తూరు:** గొర్రెలకు, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని వెటర్నరీ డాక్టర్ జి.నీలిమ సూచించారు. మండలంలోని రామన్నపాలెం పంచాయతీలో శుక్రవారం సుమారు 700 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో ఏలిక పాములు, బద్దె పురుగులు, కాలేయపు జలగలు తదితర అంతపరాన్న జీవులు కారణంగా అనేక అనర్థాలు సంభవిస్తున్నాయన్నారు. దీంతో ప్రభుత్వం ఉచితంగా గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణకు మందు పంపిణీ చేస్తుందని గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**నేడు కాళీపట్నంలో మందుల పంపిణీ**

నట్టల నివారణ మందును శనివారం కాళీపట్నంలో ఉచితంగా పంపిణీ చేస్తామని గొర్రెలు, మేకల పెంపకం దారులు ఈ కార్యక్రమాన్ని వినియోగంచుకోవాలని డాక్టర్ నీలిమ కోరారు.

## భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



నరసాపురం రూరల్: గ్రామ సభలో వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో దాసి రాజు

**పెనుగొండ:** గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.అనితకుమారి అన్నారు. శుక్రవారం పెనుగొండ మండలంలో వెంకట్రామపురం, మునమర్రుల్లో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో పాల్గొని వినతి పత్రాలు స్వీకరించారు. రీసర్వే నిర్వహించిన అన్ని గ్రామాల్లోనూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా వారి సమస్యలను పరిశీలించి, పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ టి.రాజేష్, సర్పంచ్ పిల్లి అనంతలక్ష్మీ నాగన్న, స్థానిక రైతులు, నాయకులు పాల్గొన్నారు.

**భూ సమస్యలు పరిష్కరించుకోవాలి**

రీసర్వే పూర్తయిన భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవాలని ఆచంట తహసీల్దార్ ఎం.సోమేశ్వరరావు అన్నారు. శుక్రవారం పెనుమంచిలి సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేషుల శేషువాణి, డీటీ రాజ్యలక్ష్మి, ఆర్ఐ లక్ష్మి, వీఆర్‌వో సూర్యనారాయణ పాల్గొన్నారు.

**రీసర్వే అభ్యంతరాలను ఫిర్యాదు రూపంలో ఇవ్వండి**

**పాలకొల్లు అర్బన్:** భూముల రీ సర్వేలో అభ్యంతరాలను ఈ నెల 30వ తేదీలోపు గ్రామ రెవెన్యూ అధికారికి ఫిర్యాదు రూపంలో అందజేసి రశీదు పొందాలని తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ చెప్పారు. పాలకొల్లు మండలం బల్లిపాడులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. రీ సర్వేలో ఆర్ఎస్ నెంబరికి బదులుగా ఎల్‌పీ నెంబరును ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ మార్పును రైతులు గమనించాలని సూచించారు. జాయింట్ ఎల్‌పీ నెంబర్ కేటాయించడం వలన రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారని రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.నరేష్‌కుమార్, సర్వేయర్ కేఎన్ఐ శైలజ, వీఆర్వోలు డి.నాగరాజు, అప్పారావు, ఆరిమిల్లి వెంకటరమణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదం**

**నరసాపురం రూరల్:** రైతుల సమస్యలు, అభ్యంతరాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామసభలు దోహదపడతాయని నరసాపురం ఆర్డీవో దాసి రాజు పేర్కొన్నారు. నరసాపురం మండలంలోని గొంది గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రీసర్వే గ్రామ సభల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను రాత పూర్వకంగా ఫిర్యాదు చేసి, ఆర్డీవో దాసి రాజుకు వివరించారు. సమస్యలను సానుకూలంగా విన్న ఆయన పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సభలో 43 వినతులు అందినట్లు తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి వెల్లడించారు. సమావేశంలో ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, సర్వేయర్ల బృందం, తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ: వినతి పత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్ అనితకుమారి



పాలకొల్లు అర్బన్: మాట్లాడుతున్న తహసీల్దార్ దుర్గాకిషోర్

### 22 నుంచి స్పెషల్ డ్రైవ్

**పాలకోడేరు :** మండల పరిధిలోని ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ క్యాంపులు ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు.